క్లుప్తంగా

భగవద్గీత ప్రచారం



హనుమంతవాక వద్ద భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంతం ప్రబోధకులు

ఆరిలోవ: మహా శివరాత్రిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి–ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత ప్రచారం చేపట్టారు. ఈ నెల 8న మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంతం ప్రబోధకులు హనుమంతవాక ప్రాంతంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల సారం గురించి ప్రచారం చేశారు. మహా శివరాత్రి పూజలు, జాగరణ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ పుష్కరరావు, రణ, అప్పారావు, మంగ అరుణ్, విజయ్, రమ, పద్మాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



బల్లల పండగలో పాల్గొన్న మొల్లి అప్పారావు

బీచ్ రోడ్డు: రజక సేవా సమైక్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోటలో బల్లల పండగ ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, సంఘం అధ్యక్షులు అప్పారావు, కార్యదర్శి మడక ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



దుర్గాదేవి(ఫైల్)

బీచ్ రోడ్డు: అమ్మవారి గుడికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అప్పుఘర్‌కు చెందిన దుర్గాదేవి ఈ నెల 2న ఉదయం 11.30 గంటలకు పోలమాంబ అమ్మవారి గుడికి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో తల్లి మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అయితే ప్రియుడు అశోక్‌తో మాట్లాడవద్దని తల్లి మందలించడంతో దుర్గాదేవి అదృశ్యమైనట్టు తెలిసింది.

రామ్మోహన్‌కు ఘన నివాళి



రామ్మోహన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

బీచ్ రోడ్డు: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వ్యవస్థాపకుడు పి.రామ్మోహన్ రావు వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మద్దిలపాలెంలోని రామ్మోహన్ భవన్‌లో కార్మికులు సమక్షంలో ఆయన చిత్ర పటానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఎల్లమ్మ కుటుంబానికి ఎంపీ ఎంవీవీ పరామర్శ

ఎంవీపీ కాలనీ: అనారోగ్యంతో మృతి చెందిన ఒలిశెట్టి ఎల్లమ్మ(65) కుటుంబ సభ్యులను మంగళవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. ఈ మేరకు 19వ వార్డు పెదజాలరిపేటలోని గాంధీ సెంటర్‌లోని ఎల్లమ్మ ఇంటికి వెళ్లి తొలుత ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, పరసన్న, గణేష్, పరదేశి పాల్గొన్నారు.

మెనూ అదుర్స్

నాడు: ఒకప్పుడు వసతి గృహ భోజనం అంటే పురుగులు పట్టిన అన్నం ..రుచి పచీ లేని కూరలు. అమావాస్యకో, పున్నానికో అన్నట్టుగా చికెన్ కూర పెట్టేవారు. మొత్తంగా చంద్రబాబు పాలనలో వసతి గృహాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. సంక్షేమ హాస్టళ్లు బూత్ బంగ్లాను తలపించేలా ఉండేవి. ఫలితంగా విద్యార్థుల ఆదరణ **లేక ఒక్కోటి మూసి వేసే పరిస్థితి ఉండేది.**

నేడు: వసతి గృహాల్లో ప్రతి రోజూ పండగ అన్న రీతిలో విద్యార్థులకు విందు భోజనం అందుతోంది. వారంలో మూడు రోజులు కోడి కూర పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల బలోపేతంపై దృష్టి పెట్టి మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తోంది. విద్యార్థులు మళ్లీ హాస్టళ్లకు క్యూ కడుతుండడంతో నాడు మూసివేసిన వాటిని సైతం **తెరిచేందుకు సంక్షేమ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.**



కాలేజీ హాస్టల్లో భోజనం వడ్డించుకుంటున్న విద్యార్థులు

హాస్టల్ విద్యార్థులకు విందు భోజనం

- వారంలో మూడు రోజులు కోడి కూర
- ప్రతి రోజూ ఉడికించిన గుడ్డు
- చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం
- సంక్షేమ హాస్టళ్ల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో సర్వత్రా హర్షం



భోజనం చేస్తున్న విద్యార్థులు



పరదేశిపాలెం సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలికల వసతి గృహం

విశాఖ విద్య: సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యానికి పెద్ద పీట వేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి పెంచిన డైట్ చార్జీలు అమల్లోకి వచ్చాయి. దీంతో విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందుతోంది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో 3, 4 తరగతులకు రూ.1000 మాత్రమే ఇవ్వగా, దీన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1,150లకు పెంచింది. 5 నుంచి 10వ తరగతి వరకు గతంలో రూ. 1,250లు ఇవ్వగా, దీనిని రూ.1,400 లకు పెంచారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గతంలో రూ.1,400లు ఇవ్వగా, దీనిని రూ.1,600లకు పెంచారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా డైట్‌చార్జీలతో పాటు, కాస్మోటిక్ చార్జీలను సైతం పెంచడంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతోంది.

కోడి కూర..స్పెషల్ బిర్యానీ

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, మైనార్టీ, గురుకులాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో చదువుతున్న సుమారు పది వేల మంది విద్యార్థులకు ప్రస్తుతం బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతోంది. ప్రతీ రోజూ ఉడికించిన కోడి గుడ్డు విద్యార్థులకు అందిస్తున్నారు. ఉదయం పాలు, కొద్ది సేపటి తర్వాత వేరుశనగ చిక్కీ, సాయంత్రం వేళ సేమియా, గుగ్గిళ్లు వంటి స్నాక్స్ ఇస్తున్నారు. ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో వారంతో మూడు రోజులు కోడి కూర, ఆదివారం స్పెషల్ బిర్యానీ పెడుతుండడంతో మాకు ప్రతీ రోజూ విందు భోజనమే అని విద్యార్థులు అంటున్నారు.

హాస్టళ్ల బలోపేతంపై దృష్టి

వెనుబడిన వర్గాల విద్యార్థుల చదువులకు భరోసాగా నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఠంఛన్‌గా అందుతుండడంతో విద్యార్థులు చదువుల బాట పడుతున్నారు. హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ప్రత్యేక చొరవతో జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో వసతి గృహాలను అభివృద్ధి చేస్తున్నారు.

ఆరోగ్య వంతులుగా ఉండాలనే..



వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటేనే చదువుల్లో రాణిస్తారు. అందుకోసం విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నాం. వసతి గృహాలపై తరచూ పర్యవేక్షణ చేస్తున్నాం.

– కె. రామారావు, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా

పరిశుభ్రతకు ప్రాధాన్యం



విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణకు రుచికరమైన భోజనం అందించడంతో పాటు, వసతి గృహ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. విద్యార్థులకు తరచూ ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అంతా సమన్వయంతో విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్నాం.

– దాసరి సత్యారావు, బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్

భోజనం ఎంతో బాగుంటుంది



మా అన్నయ్య మహేష్, నేను కూడా సాంఘిక సంక్షేమ గురుకులంలో చదువుకుంటున్నాం. మాకు ఎంతో రుచికరమైన భోజనం పెడుతున్నారు. హాస్టల్ అంటే ఒకప్పుడు ఇబ్బంది కరంగా ఉండేది. కానీ ఇప్పుడు సౌకర్యాలు బాగా మెరుగయ్యాయి. మా సార్లు చదువు కూడా బాగా చెబుతారు.

– టారి దేవేందర్, పదో తరగతి, శ్రీకృష్ణాపురం

వృద్ధులు.. తరాలకు వారధులు



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: వృద్ధులు తరాల మధ్య వారధులుగా నిలుస్తారని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. మంగళవారం ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫౌండేషన్ రీజినల్ రిసోర్స్, ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వృద్ధుల సమస్యల'పై సలహాలు'మూడు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం, సహాయం చేయడం ఒక వరంగా భావించాలన్నారు. వృద్ధుల సైతం ఉత్సాహంగా రోజువారీ కార్యక్రమాలను నిర్వహించుకుంటూ ఆరోగ్య జీవనం సాగించాలన్నారు. మానసిక కుంగుబాటును ఎట్టి పరిస్థితుల్లో దరి చేరనివ్వరాదన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.ఆర్. గంగాధరన్ మాట్లాడుతూ వృద్ధాశ్రమాలు ఏర్పడటానికి కారణాలు, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను వివరించారు. ఏయూ సోషల్ వర్క్ విభాగ ఆచార్యులు కె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధుల సమస్యలు, వారికి సమాజం నుంచి కల్పించాల్సిన భద్రత, తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య శివరావు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 25 మందికి పైగా వివిధ వృద్ధాశ్రమాలలో పని చేస్తున్న కౌన్సెలర్లు, మేనేజర్లు, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

నారీశక్తి వందన మారథాన్ వాక్

ఆరిలోవ: బీజేపీ విశాఖ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ఆరిలోవలో నారీశక్తి వందన మారథాన్ వాక్ నిర్వహించారు. బాలాజీ నగర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ మట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా నారీశక్తి వందన మారథాన్ వాక్ నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో మహిళల అభ్యున్నతి కోసం ప్రధానమంత్రి మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

విశాఖ పర్యటనకు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మధురవాడ ఐటీ హిల్స్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద పలువురు నేతలు మంగళవారం ఘన స్వాగతం పలికారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, ఆడిటర్ జీవీ, తదితరులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.





సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి





సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆడిటర్ జీవీ, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

రూ.30 లక్షలతో 'నాగావళి' ఆధునికీకరణ

- ఏయూలో అందుబాటులోకి నూతన హాస్టల్
- విద్యార్థినులతో ప్రారంభింపజేసిన వీసీ ప్రసాదరెడ్డి



అందుబాటులోకి వచ్చిన నాగావళి హాస్టల్



విద్యార్థినులతో ప్రారంభింపజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రూ.30 లక్షల నిధులతో ఆధునీకరించిన హాస్టల్ భవన సముదాయం నాగావళి పేరిట అందుబాటులోకి వచ్చింది. నాడు–నేడు పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన ఈ హాస్టల్‌ను మంగళవారం ఉదయం విద్యార్థినులతో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభింపజేశారు. కళాశాలలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా అదనపు హాస్టల్‌ని అందుబాటులోకి తీసుకువచ్చారు. కొత్త హాస్టల్ వసతి అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం వీసీ విద్యార్థినులతో మాట్లాడారు. అక్కడే టిఫిన్ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య ఎస్.కె. భట్టి, ఆచార్య కె.విశ్వేశ్వరరావు, చీఫ్ వార్డెన్ కె.దుర్గారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ హాస్టల్ భవనానికి నాగావళి అని పేరు పెట్టారు.


హాస్టల్ విశేషాలు

గతంలో బాలురకు వినియోగించిన బ్లాక్–4 హాస్టల్‌ని ఇప్పుడు పూర్తి స్థాయిలో ఆధునికీకరించి విద్యార్థినులకు కేటాయించారు. గుండ్రంగా ఉండే ఈ భవనంలో మొత్తం 96 గదులు ఉన్నాయి. ఒక్కో గదిలో ఇద్దరి చొప్పున 192 మంది విద్యార్థినులకు వసతి కల్పించారు. అవసరమైన మంచాలను వర్సిటీ సమకూర్చింది. మూడు అంతస్తుల్లో మొత్తం ఆరు టాయిలెట్స్ బ్లాక్‌లను అభివృద్ధి చేశారు. అధునాతన టైల్స్ వేసి కొత్తగా తీర్చిదిద్దారు. హాస్టల్ బయట పాడైన నీటి సరఫరా, డ్రైనేజీ పైపులను మార్పు చేశారు. పై అంతస్తులో నీటి నిల్వకు అదనపు ట్యాంకులను ఏర్పాటు చేశారు. దుస్తులు ఉతుక్కోవడానికి ఉపయుక్తంగా షెడ్ నిర్మించారు.

భవనం చుట్టూ ప్రహరీ

హాస్టల్ భవనం చుట్టు ఒక వైపు సిమెంట్ గోడను, మరో వైపు ఎత్తయిన ఇనుప కంచెను నిర్మించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హాస్టల్ చుట్టూ రక్షణ గోడను నిర్మించారు.

నిఘా నీడలో ఎంవీపీ రైతుబజార్



ఈవో ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన మానిటర్

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో వారం రోజుల క్రితం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ స్థలాల్లో 16 సీసీ కెమెరాలు అమర్చారు. ఈవో కార్యాలయంలో మానిటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో 8 సీసీ కెమెరాలు ఉండేవి. అవి పాడైపోయాయి. రైతులు, వ్యాపారులు, వినియోగదారుల సౌలభ్యం కోసం వాటి స్థానంలో మార్కెటింగ్ శాఖ అధికారులు 16 సీసీ కెమెరాలు ఇటీవల ఏర్పాటు చేశారు. రైతుబజార్‌లో ఎక్కడ ఏం జరుగుతుందో వీటి ద్వారా క్లియర్‌గా తెలిసేలా అమర్చారు. రెండు ద్వారాల నుంచి లోపల భాగం కనిపించే విధంగా, లోపల స్టాళ్ల నుంచి అన్ని మూలల్లో జరిగిన వ్యవహారాలన్నీ ఆయా కెమెరాలలో నమోదవుతున్నాయి. ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానిటర్ ద్వారా పరిశీలిస్తున్నారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే ఈవో ప్రసాద్, సిబ్బంది ఆయా స్టాళ్ల వద్దకు తక్షణమే వెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

జూలో నీటి ఏనుగుల సందడి



ఎన్‌క్లోజర్‌లో కలియ తిరుగుతున్న నీటి ఏనుగులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో నీటి ఏనుగులు సందడి చేస్తున్నాయి. సీతాకోక చిలుకల పార్కుల ఎదురుగా నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఉంది. దానిలో రెండు నీటి ఏనుగులు ఉన్నాయి. ఆ రెండూ తల్లీపిల్ల కావడం విశేషం. తల్లి నీటి ఏనుగు పద్మ, పిల్ల నీటి ఏనుగు జూనియర్ దలపతి రెండూ కలియ తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. సాధారణంగా ఇవి నీటిలోనే ఎక్కువ సమయం గడుపుతాయి. సందర్శకులకు వాటి తల భాగం మాత్రమే బయటకు కనిపిస్తుంది. యానిమల్ కీపర్ ఆహారం వేసిన సమయంలో రెండూ ఒడ్డుకు చేరుకుని ఆహారం తింటాయి. మళ్లీ నీటిలోకి వెంటనే వెళ్లిపోతాయి. కానీ ఎన్‌క్లోజర్‌లో నీటి కొలను ఒడ్డున ఎక్కువ సేపు గడిపి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో తూర్పు కాపులు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు తూర్పు కాపులకే అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మజ్జి అప్పారావు విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు 17 నియోజకవర్గాల్లో తూర్పు కాపులు అధికంగా ఉన్నారని తెలిపారు. పెందుర్తి, అనకాపల్లి, భీమిలి, చోడవరం, మాడుగుల, విజయనగరం జిల్లా తదితర ప్రాంతాలను తూర్పు కాపులకు కేటాయించాలన్నారు. ఉత్తరాంధ్రేతర కాపులు తూర్పు కాపు నియోజకవర్గాల్లో తూర్పు కాపులుగా చలామణీ అవుతూ తమను దోచుకోవడమే కాక, తమ రిజర్వేషన్లు కూడా దోచుకుని దర్జాగా తిరుగుతున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి వెంకట రమణమూర్తి, లోగిన గణేష్, కేఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులతోనే సుస్థిర అభివృద్ధి



ఆచార్య బాలమోహన్‌దాస్‌ను సత్కరిస్తున్న బ్యాంకు ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: సహకార బ్యాంకులతోనే దేశం సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ అన్నారు. కనకమహాలక్ష్మీ కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ రజతోత్సవాలను బ్యాంకు ఎంవీపీ కాలనీ శాఖలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆచార్య బాలమోహన్‌దాస్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సహకార బ్యాంకులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముఖగా నిలుస్తున్నాయన్నారు. ఒక పక్క వినియోగదారులకు సేవలు అందిస్తూనే దేశ ఆదాయానికి సహకారం అందిస్తున్నాయన్నారు. ఖాతాదారులకు కనకమహాలక్ష్మీ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ఖాతాదారులకు సులభతరమైన సేవలు అందిస్తున్నారన్నారు. బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరణతో బ్యాంకు 24 ఏళ్లు పూర్తి చేసుకొని 25వ ఏట అడుగుపెట్టిందన్నారు. విశాఖలో 28 శాఖలుగా ఖాతాదారులకు విలువైన, నమ్మకమైన సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం బ్యాంకు ప్రతినిధులు ముఖ్యఅతిథి ఆచార్య బాలమోహన్‌దాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పట్టాభిరామ్, బ్యాంకు డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, జి.రామకృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త డయాలసిస్ పింఛన్ అందజేత



లక్ష్మీనగర్‌లో లబ్ధిదారుడికి డయాలసిస్ పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో ఓ డయాలసిస్ బాధితుడికి వైఎస్సార్ డయాలసిస్ పింఛన్ మంజూరైంది. ఈ మేరకు లబ్ధిదారుడికి సచివాలయం సిబ్బంది మంగళవారం పింఛన్ అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనగర్‌లో కూర్మదాస్ తాండవ కృష్ణ కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి వైద్యులు డయాలసిస్ చేస్తున్నారు. దీంతో ఇటీవల ఆయన సచివాలయం సిబ్బంది ద్వారా డయాలసిస్ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మంగళవారం వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ రాధిక, సిబ్బందితో కలసి వెళ్లి బాధితుడికి మొదటి నెల పింఛన్ రూ.10 వేలు నగదు అందజేశారు. దీంతో కృష్ణ, అతని కుటుంబ సభ్యులు ఈ సహాయం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ బేత దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.